క్లుప్తంగా

నేడు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

కొరిటిపాడు: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని గ్రామీణ వాతావరణంలో నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో వేంచేసిఉన్న పెద్దేటమ్మ ఆలయం వద్ద బుధవారం ఉగాది పర్వదిన సందర్భంగా పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రవచనాచార్య డాక్టర్ నందవనం శ్రీనివాసరావు ప్రసంగకర్తగా హాజవుతారని తెలిపారు.

లిటిల్ స్టెప్స్ స్కూల్లో ఉగాది వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: నవభారత్‌నగర్‌లోని లిటిల్ స్టెప్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో మంగళవారం ముందస్తు శోభకృత్ నామసంవత్సర ఉగాది వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. విద్యార్థినీ, విద్యార్థులు అచ్చతెలుగు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ షేక్ షాజహాన్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవ్వో ఆర్గనైజేషన్‌కు ఉత్తమ సామాజిక సేవా పురస్కారం



గుంటూరు మెడికల్: సేవ్వో ఆర్గనైజేషన్ ఉత్తమ సామాజిక సేవా అవార్డును అందుకుంది. శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేటలో మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో అక్షర ఫౌండేషన్ నిర్వాహకులు సామాజిక ఉత్తమ సేవలు అందించిన సంస్థలకు అవార్డులను బహూకరించారు. ఉత్తమ సామాజిక సేవా అవార్డును సేవ్వో డైరెక్టర్ కార్తీక్ అందుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రామ్‌కుమార్‌రెడ్డి, నాగయ్య, పాల్వాయి వెంకన్న, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



నెహ్రూనగర్: చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. పోషణ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెంగళరావునగర్‌లో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు రక్తహీనత బారినపడకుండా, పోషణలోపం లేకుండా పిల్లలకు చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు.

18 మొబైల్ ఫోన్లు అప్పగింత



నగరంపాలెం: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్‌ను ఉపయోగించుకోవాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో మంగళవారం 18 మంది బాధితులకు మొబైల్‌ఫోన్లను ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల సౌలభ్యం కోసం జనవరి చివర్లో జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 86888 31574ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఐటీ కోర్ పోలీస్ సిబ్బంది శ్రమించి పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఏఎస్పీ కె.సుప్రజ, ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, ఐటీ కోర్ ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ

- జగనన్న గోరుముద్దలో భాగంగా అమలు
- పాఠశాలల్లో ఉత్సాహంగా పంపిణీ కార్యక్రమం



పాత్తూరివారితోట జీఎంసీ స్కూల్లో విద్యార్థినితో రాగిజావ తాగిస్తున్న డెప్యూటీ మేయర్ షేక్ సజీల

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించి, బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా రూపకల్పన చేసిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని గుంటూరు నగర పరిధిలోని ప్రభుత్వ, నగర పాలక సంస్థ, ఎయిడెడ్ పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా రాగిజావ తాగారు.

■ పొత్తూరివారితోటలోని నగరపాలక సంస్థ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల విద్యార్థులతో రాగిజావను స్వయంగా తాగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖర్చుకు వెనుకాడకుండా మధ్యాహ్న భోజనం మెనూలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.విజయలక్ష్మి, ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం అక్తరున్నీసా, ఉపాధ్యాయిని రాబియా బస్రీ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

■ బీఆర్ స్టేడియం ఎదుట ఉన్న శ్రీమహాకవి తిక్కన-పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

■ కొత్తపేటలోని జలగం రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

■ సీతారామ్‌నగర్‌లోని శ్రీసరస్వతి కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు పి.విజయలక్ష్మి పర్యవేక్షణలో రాగిజావ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ నాగూర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వడ్డూరి సాయిశిల్ప, ఉపాధ్యాయులు గోవిందరెడ్డి, రవి, వేంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి రూ.35 వేల ఆర్థిక సహాయం



ప్రతాప్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న దుర్గాప్రసాద్, తిలక్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతుడైన ఓ నిరుపేద విద్యార్థికి న్యూ గర్తపురి చాణక్యాస్ ఫ్రెండ్స్ సర్కిల్ గుంటూరు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సంయుక్తంగా రూ.35 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంగళవారం గుంటూరు క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఉదయగిరి చెందిన గొల్లపల్లి కొండయ్య, వెంగమ్మ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారని, వారి కుమారుడైన ప్రతాప్‌కుమార్ చిన్న, చిన్న పనులు చేస్తూ డిగ్రీ వరకు చదువుకున్నారని తెలిపారు. గ్రూప్–1 లక్ష్యంగా శిక్షణ కోసం గుంటూరు క్లబ్‌లోని బార్‌లో బాయ్‌గా చేరి, పగలు కోచింగ్ తీసుకుంటూ, సాయంత్రం వేళ క్లబ్ బార్‌లో పని చేస్తూ గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యాడని వివరించారు. ప్రతాప్‌కుమార్‌లోని అకుంఠిత దీక్ష, పట్టుదల గమనించిన న్యూ గర్తపురి చాణక్యాస్ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ యాగంటి దుర్గాప్రసాద్, మిత్రులతో కలిసి బార్‌లో ఉద్యోగానికి తాత్కాలిక విరామం ఇచ్చి, ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఫైనల్స్‌కు సన్నద్ధం కావాలని ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రూప్–1 అధికారిగా ఎదిగేందుకు అవసరమైన చేయూత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు క్లబ్ కార్యదర్శి నల్లమోతు సాంబశివరావు, మిత్రులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

బ్రిగేడియర్ సోమశేఖర్



మూడు చక్రాల వాహనాన్ని అందజేస్తున్న బ్రిగేడియర్ సోమశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు ఆంధ్ర, తెలంగాణ ప్రాంత స్టేషన్ కమాండర్, సేనా మెడల్ బ్రిగేడియర్ కె.సోమశేఖర్ పేర్కొన్నారు. సోమవారం శ్యామలనగర్‌లోని మాజీ సైనికుల ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా నిర్మించిన ఫార్మసీ కేంద్రం, ఫిజియోథెరపీ, సందర్శకులు వేచిఉండే భవనాలను ప్రారంభించిన సోమశేఖర్ మాజీ వికలాంగ సిపాయి శ్రీనివాస్‌కు అసోసియేటెడ్ ఆటో సర్వీసెస్ వితరణ చేసిన మూడు చక్రాల వాహనాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో బ్రిగేడియర్ సోమశేఖర్ మాట్లాడుతూ 2004లో నెలకొల్పిన జిల్లా మాజీ సైనికుల ఆరోగ్య కేంద్రానికి కావలసిన క్లినికల్ సేవల్లో అధునాతన వైద్య సదుపాయాలు, పరికరాలతో విస్తరణ చేయబోతున్నట్లు తెలియజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు 30 వేల మంది ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ విశ్రాంత డైరెక్టర్ వెంకటరెడ్డి, హవల్దార్ టి.పోతురాజు, ఆరోగ్య కేంద్రం పాలనాధికారి కల్నల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

భారతీయ సంస్కృతికి ప్రతీక ఉగాది



శ్యామలను సత్కరిస్తున్న హిందూ కళాశాల యాజమాన్య, అధ్యాపక ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సంస్కృతికి ప్రతీక ఉగాది పర్వదినమని ప్రముఖ కవయిత్రి, తాడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీడీ శ్యామల అన్నారు. మంగళవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో అక్షర సారస్వత సమితి, ప్రమదావనం సంయుక్త నిర్వహణలో శోభకృత్ నామ ఉగాది ముందస్తు వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ ఎంబీడీ శ్యామల మాట్లాడుతూ ఉగాది పర్వదినం నాడు ఆచరించే ప్రతి అంశం సామాజిక స్పృహతో కూడుకుని ఉందన్నారు. ఉగాది పచ్చడి ఆరోగ్య ప్రదాయినిగానే కాక జీవిత పరమార్థాన్ని, పంచాంగ శ్రవణం ఏకాలంలో మనిషి ఎలా నడుచుకోవాలనే అంశాన్ని బోధిస్తుంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, అక్షర సారస్వత సమితి అధ్యక్షుడు డాక్టర్ గుడిపూడి విజయరత్నకుమార్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ వై.మల్లికార్జునరావు, ప్రమదావనం అధ్యక్షురాలు బ్యూలా రాణి, తెలుగు అధ్యాపకురాలు ఆలూరి నటరాజకుమారి పాల్గొన్నారు.

వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ తనిఖీ



పట్నంబజారు: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పొన్నూరు రోడ్డు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్థితిగతులను ఈస్ట్ డీఎస్పీ సీతారామయ్య, ట్రాఫిక్ సీఐ నిసార్‌బాషాను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు.

ప్రజలకు ఎమ్మెల్యే ముస్తఫా ఉగాది శుభాకాంక్షలు

పట్నంబజారు: నగర ప్రజలకు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినంతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని పేర్కొన్నారు. ప్రతి పనిలో విజయం చేకూరాలని ఆకాంక్షించారు.

అలరించిన సాహిత్య సమాలోచన



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కృష్ణప్రసాద్, భానుభవాని

పాతగుంటూరు: బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం తుమ్మల కళాపీఠం ఆధ్వర్యంలో ఏటుకూరి సాహిత్య సమాలోచన, భాగవత సమారాధన జరిగాయి. సభకు డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కేవీఎల్ఎన్ అప్పలాచార్యులు భాగవతంలోని విశిష్టతను వివరించారు. డాక్టర్ వై.భానుభవాని ఏటుకూరి వారి కవితా వైభవాన్ని పద్యాలతో విశదీకరించారు. అనంతరం నవీన విద్యానికేతన్ స్కూల్‌లో నిర్వహించిన పద్యపఠన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ పాపినేని శివశంకర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, డాక్టర్ వెనిశెట్టి సింగారావు, ఏలూరి సూర్యనారాయణ, నూతలపాటి తిరుపతయ్య, పారా అశోక్, డాక్టర్ జి.అరుణాదేవి, కె.నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మద్దాళి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున మద్దాళి గిరి

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన వేడుకలకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్‌లు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా సర్వమత ప్రార్థనలు నిర్వహించి ఎమ్మెల్యే గిరిని ఆశీర్వదించారు. అనంతరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రగిరి ఏసురత్నం, డెప్యూటీ మేయర్‌లు షేక్ సజీల, వనమా బాలవజ్రబాబుతో కలిసి ఎమ్మెల్యే గిరి కేక్‌ను కట్ చేశారు. పార్టీ మైనారిటీ విభాగం నగర అధ్యక్షుడు షేక్ గౌస్‌పీరా ఆధ్వర్యంలో 100 కిలోల కేక్‌ను ఏర్పాటు చేశారు.

విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ స్కూల్లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పూర్తి చేసుకుని, కళాశాల దశలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో సంస్కారవంతులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులు పాఠశాలతో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు గురువులకు పాదాభివందనం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ అరోన్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కరరెడ్డి, జోసఫ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయాల్లోనే సేవలందిస్తాం

ఉద్యోగ సంఘ నాయకులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సంఘ నాయకులు

గుంటూరు వెస్ట్: గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘ నాయకుల నిరసన దీక్ష మంగళవారం కూడా కొనసాగింది. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ వర్క్ టు రూల్ ప్రకారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకే విధుల్లో ఉంటామన్నారు. ఆ తర్వాత ఏ పనిచేయమని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ కె.సంగీతరావు, వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.